తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
యాదాద్రిభువనగిరి | శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

ధరణి, భూభారతి వచ్చినా తీరని 'భూ'చిక్కులు

22ఏ భూముల కబ్జాల్లో అధికార, ప్రతిపక్ష నేతలు: పెంట రమేష్

స్వార్థ రాజకీయాల కోసం ప్రజాసమస్యలు పక్కనపెట్టారని విమర్శ

తొలివెలుగు, రాజాపేట: ప్రభుత్వాలు మారి ధరణి, భూభారతి వంటి కొత్త చట్టాలు తీసుకొచ్చినా పేదల భూసమస్యలు తీరడంలేదని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాజాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22ఏ జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములతో పాటు భూదాన్, అసైన్డ్, చెరువు శిఖం భూములను అధికార, ప్రతిపక్ష నాయకులు అడ్డగోలుగా కబ్జా చేశారని ఆరోపించారు.ప్రజాసమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలేసిన ప్రజాప్రతినిధులు సొంత స్వార్థ రాజకీయాలు చేసుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో పాలకుల తీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూదోపిడీని ప్రస్తుత ప్రభుత్వం బహిర్గతం చేయాలని, అలాగే కాంగ్రెస్ నేతల భూకబ్జాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పరస్పర విమర్శలు మాని భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సెటిల్మెంట్లకు అడ్డాగా మున్సిపల్ కార్యాలయం?

మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సెటిల్మెంట్ల దందా?

'ఇచట అన్ని రకాల సెటిల్మెంట్లు చేయబడును' అన్నట్లుగా వ్యవహారాలు?

ముగ్గురు పట్టణ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే దందా సాగుతోందని ఆరోపణలు

కొత్తగా ఇళ్లు నిర్మించేవారే టార్గెట్.. పర్మిషన్ల పేరుతో వేధింపులంటూ ఫిర్యాదులు

రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాల పంచాయతీలు.. సెటిల్మెంట్లకు మున్సిపల్ కార్యాలయమే వేదిక?

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ప్రజల విజ్ఞప్తి

తొలివెలుగు, చౌటుప్పల్: ప్రజలకు మౌలిక వసతులు, మున్సిపల్ సేవలు అందించాల్సిన కార్యాలయం.. వివాదాల పరిష్కారానికి వేదికగా మారుతోందా? లేక సెటిల్మెంట్లకు అడ్డాగా మారిందా? అనే ప్రశ్నలు చౌటుప్పల్ పట్టణంలో వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని వివిధ రకాల సెటిల్మెంట్ల వ్యవహారాలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

'ఇచట అన్ని రకాల సెటిల్మెంట్లు'?

ఇళ్ల నిర్మాణ అనుమతులు, నిర్మాణ నిబంధనలు, ఆస్తులకు సంబంధించిన వివాదాలు తదితర అంశాల్లో కొందరు వ్యక్తులు జోక్యం చేసుకుంటూ పంచాయతీలు, సెటిల్మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సిన చోట మధ్యవర్తిత్వం పేరుతో వ్యవహారాలు నడుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తగా ఇళ్లు కట్టేవారే టార్గెట్?

పట్టణంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మిషన్లు, నిర్మాణ నిబంధనలు, ఇతర అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసి చివరకు సెటిల్మెంట్ చేసేందుకు ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై మున్సిపల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రియల్ ఎస్టేట్ పంచాయతీలకు వేదిక?

రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాలకు సంబంధించిన వివాదాలు, భూ లావాదేవీల్లో తలెత్తుతున్న సమస్యలు, వ్యక్తుల మధ్య ఆస్తి వివాదాల్లోనూ కొందరు జోక్యం చేసుకుని పంచాయతీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయ పరిధికి సంబంధం లేని అంశాల్లోనూ ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగ్గురు ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనేనా?

ఈ మొత్తం వ్యవహారం వెనుక ముగ్గురు పట్టణ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. వారి అనుచరులు, మధ్యవర్తుల ద్వారా వివాదాలను సెటిల్మెంట్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధుల అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకు అండ ఉందా?

ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాల్సిన ప్రభుత్వ వ్యవస్థల్లోనే ఇలాంటి ఆరోపణలు రావడం పట్ల పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రతి వ్యవహారం నిబంధనల ప్రకారం, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి

మున్సిపల్ కార్యాలయంలో పర్మిషన్లు, నిర్మాణ అనుమతులు, రియల్ ఎస్టేట్ వివాదాల పేరుతో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలోని సీసీ కెమెరా దృశ్యాలు, ఫైళ్ల పరిశీలన, ఫిర్యాదుల వివరాలు, సంబంధిత అధికారుల విధులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు

చౌటుప్పల్‌లో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎలాంటి అక్రమ వ్యవహారాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సెటిల్మెంట్ల ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించి, తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆత్మగౌరవ పోరాటాన్ని కొనసాగిస్తాం

సూరారంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగ

కుల వివక్షకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి బిర్రు మహేందర్ మాదిగ

తొలివెలుగు, రామన్నపేట : మాదిగ సమాజ ఆత్మగౌరవం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సాగించిన పోరాటాలను అదే స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌ఛార్జి బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. మండలంలోని సూరారంలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఇటీవల బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో మాదిగలపై కుల వివక్షతో దాడి జరిగిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి, జెండాను ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగ పదాన్ని ఆత్మగౌరవ ప్రతీకగా మార్చిందని తెలిపారు. 2024లో సుప్రీంకోర్టు ఎస్సీ ఉపవర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఉద్యమ విజయానికి నిదర్శనమన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడటం అంటే ఇతర వర్గాలపై ద్వేషం కాదని, సమాన హక్కులు సాధించుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, నేతలు దండోరా మల్లేష్, కక్కిరేణి పాపన్న, నల్ల స్వామి, నోముల చిరంజీవి, బందెల నరేష్, బొడ్డు శంకరయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ గ్రంథాలయంలో ప్రజాపాలన వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆదిమూలం సోమేశ్

ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పాఠకులు

తొలివెలుగు, వలిగొండ : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వలిగొండ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ప్రాంగణంలో జాతీయ జెండా రెపరెపలాడింది. శాఖా గ్రంథాలయ అధ్యక్షుడు ఆదిమూలం సోమేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, వార్డు సభ్యుడు కౌడే కృష్ణ, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి సత్తిరెడ్డి, పల్సమ్ సతీష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని వరుణ్‌గౌడ్, పిట్టల ఆంజనేయులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథం

రామన్నపేటలో ఘనంగా విమోచన దినోత్సవం, ప్రధాని పుట్టినరోజు

జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించిన బీజేపీ శ్రేణులు

తొలివెలుగు, రామన్నపేట: మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని భాజపా మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను భాజపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరేకంటి మొగులయ్య మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోం దన్నారు. భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్ట యాదయ్య, సీనియర్ నాయకులు డోగుపర్తి సుభాష్, జెల్లా లక్ష్మీ నారాయణ, మన్యం పద్మారెడ్డి, రాపోలు స్వామి, శనగొండ భిక్ష మాచారి, భాస్కర చారి, సురవి హరిబాబు, ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్ చారి, ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజన్, బట్టి రమేష్, కార్య దర్శులు గన్నే బోయిన మధు, బతుక నరేష్, రేపాక లింగస్వామి, ఏనూతుల సురేష్, మచ్చ మహేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో తండాల అభివృద్ధి

జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్



తొలివెలుగు, రాజాపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తండాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్ అన్నారు. గురువారం రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా జస్వంత్ మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాములు నాయక్, గన్యా నాయక్, లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు దేవీ నాయక్, మడావత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతోనే మానసిక ప్రశాంతత



పోచంపల్లిలో నేతాజీ సమాఖ్య ఆధ్వర్యంలో అన్నదానం

స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : పురపాలక కేంద్రంలో నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ పంచమ రాత్రుత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నప్రసాద వితరణ శోభాయమానంగా జరిగింది. దాతలు బద్దం జితేందర్ రెడ్డి, కొట్టం కరుణాకర్ రెడ్డి, మద్ది మధు, చెరుకు నవీన్‌ల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గణనాథుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. భక్తి మార్గం ద్వారా మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భరత లవకుమార్, కో–ఆప్షన్ సభ్యుడు మద్ది మధుసుధన్ రెడ్డి, నేతాజీ యువజన సమాఖ్య అధ్యక్షుడు మక్తల వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కీర్తి సంజీవ, కోశాధికారి వంగూరి పాండు, ప్రతినిధులు ఏలే హరిశంకర్, గునిగంటి వెంకటేష్ గౌడ్, వంగూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఏఈకి ఘన సత్కారం

ఇంజనీర్స్ డే సందర్భంగా వేడుకలు

ఏఈ వివేకానంద గౌడ్ సేవలు ఆదర్శనీయమన్న ఎంపీడీవో

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండల గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) వేముల వివేకానంద గౌడ్‌ను గురువారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని కార్యాలయంలో ఈ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో కూతల నాగవేణి మాట్లాడుతూ.. గృహ నిర్మాణ శాఖలో ఏఈ వివేకానంద గౌడ్ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచారని, ఆయన పనితీరు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే సాయుధ పోరాట నిజమైన వారసులు

నాడు జరిగింది వర్గ పోరాటమే.. మత పోరాటం కాదు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు: బూర్గు కృష్ణారెడ్డి

తొలివెలుగు, చౌటుప్పల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మతాల మధ్య జరిగిన పోరాటం కాదని, భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన వర్గ పోరాటమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా చౌటుప్పల్‌లోని కామ్రేడ్ కందాల రంగారెడ్డి స్మారక భవనంలో గురువారం సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కొందరు వక్రీకరిస్తూ హిందువులు, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా ప్రచారం చేస్తున్నారని కృష్ణారెడ్డి విమర్శించారు. నాటి పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి, దోపిడీకి వ్యతిరేకంగా సాగిందని పేర్కొన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టు కార్యకర్తలు త్యాగాలు చేశారని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వివిధ పేర్లతో పేర్కొంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని కృష్ణారెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17ను తన రాజకీయ దృక్పథం ప్రకారం 'విలీన దినం'గా పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ పోరాటాల పాత్రను గుర్తించాలని కోరారు. "ఇది వేరు తెలంగాణ కాదు.. వీర తెలంగాణ" అని ఆయన అన్నారు. సెమినార్‌లో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, రాగిరి కిష్టయ్య, గంగాదేవి సైదులు, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, యాట బాలరాజు, కొండే శ్రీశైలం, ఆకుల ధర్మయ్య, పర్ని ధర్మారెడ్డి, ఉష్కాగుల శ్రీను, కందగట్ల ఆనంద్, మహేష్, రాజు, చికూరు ఈదయ్య, మోగుదాల రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా తెలంగాణ విమోచన దినోత్సవం

కొయ్యలగూడెంలో రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా

గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ

పాల్గొన్న సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్, ప్రజాప్రతినిధులు

తొలివెలుగు, చౌటుప్పల్ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొయ్యలగూడెం గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జిల్లా పవన్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు సభ్యులు ఉపేందర్, వరలక్ష్మి, సుజాత, గడ్డం అశోక్, ఎర్రగుంట నర్సింహా, వనం సురేందర్‌తో పాటు గ్రామస్థులు జెల్ల పాండు, ఉదరి ప్రసాద్, లలిత తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి 'మహా నైవేద్యం'

సాయి మందిరంలో కన్నులపండువగా నవరాత్రి ఉత్సవాలు

నేడు స్వామివారికి 'లక్ష పుష్పార్చన'

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి మహా నైవేద్య నివేదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు నంగునూరి చంద్రశేఖర్, శాశ్వత బియ్యం దాతలు పుల్లూరు సూర్యకళ–ఉపేందర్ దంపతులు, ఆలయ ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యుల సహకారంతో ఈ పూజలు జరిగాయి. పూజాధికార్యక్రమాల్లో బుడమ సత్యనారాయణ–పద్మావతి దంపతులు పాల్గొనగా, ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొని భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు లంబోదరుడికి లక్ష పుష్పార్చన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

బాధితురాలి కుటుంబానికి 'సీఎంఆర్ఎఫ్' అండ

రూ.60 వేల చెక్కు అందజేసిన స్థానిక నాయకులు

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు



తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన గోపగోని నాగమణి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.60 వేల ఆర్థిక సాయం చెక్కును గురువారం అందజేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ద్వారా ఈ సాయం మంజూరైంది. స్థానిక నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ కుటుంబ పరిస్థితిని గుర్తించి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సాయం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్ద శ్రీకాంత్, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోపవుని బాలయ్య, వార్డు సభ్యులు మర్ల శ్రీను, శ్రీధర్, చంద్రశేఖర్, మర్ల రమేష్, నాయకులు అన్నెమైనా జగన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తొలివెలుగు
TGTEL/26/A6221
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

గ్రామకంఠం భూ కబ్జాపై స్పందించిన అధికారులు

తొలివెలుగు కథనానికి స్పందన.. స్థల పరిశీలన

కబ్జా చేసిన భూమిలోని కడీల తొలగింపు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు: అధికారులు

తొలివెలుగు, భువనగిరి: పులిగిల్ల గ్రామంలో గ్రామకంఠం భూముల ఆక్రమణపై 'గ్రామకంఠం భూములకు గ్రహణం?' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. కథనం వెలువడిన అనంతరం గ్రామ సెక్రటరీ సైదులు సిబ్బందితో కలిసి, గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ భూమిలో కబ్జాకు గుర్తుగా ఏర్పాటు చేసిన కడీలను అధికారులు తొలగించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దీంతో గ్రామకంఠం భూముల పరిరక్షణకు అధికారులు స్పందించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ 'తొలివెలుగు' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువైద్యశాల నిర్మించాలి:

కబ్జా ప్రయత్నం జరిగినట్లు పేర్కొంటున్న గ్రామకంఠం భూమిలో ప్రభుత్వ పశువైద్యశాలను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న పశువైద్యశాల భవనం పురాతనంగా ఉండటం తోపాటు, జనావా సాల మధ్యలో ఉండటం వల్ల పశువులను అక్కడికి తీసుకురావడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు చెబుతున్నారు. గ్రామానికి వెలుపల ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో నూతన పశువైద్యశాలను నిర్మిస్తే రైతులకు, పశుపోషకులకు సౌకర్యంగా ఉంటుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్థలాన్ని పరిశీలించి, పశువైద్యశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తొలివెలుగు ఎఫెక్ట్

ఫిరాయింపులపై రేవంత్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదు

భట్టిపై ప్రేమ ఉంటే సీఎం పదవి ఇవ్వాలి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల గురించి సీఎం రేవంత్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని భారాస నాయకురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అసెంబ్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆమె తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ''నేను కాంగ్రెస్‌ను వీడేటట్లు చేసింది మీరందరూ కాదా? నేను పార్టీ మారితేనే భట్టి ప్రధాన ప్రతిపక్ష నేత పదవి పోయిందా? రేవంత్‌రెడ్డికి భట్టిపై అంత ప్రేమ ఉంటే ఇప్పుడు ఆయనకు సీఎం పదవి ఇవ్వాలి. నా భర్త ఇంద్రారెడ్డి చనిపోయినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌లో నేను 2000 సంవత్సరంలో చేరా. కాంగ్రెస్ పార్టీకి నేనేం సేవ చేశానో రంగారెడ్డి జిల్లా ప్రజలకు తెలుసు. నా కుమారుడు కార్తీక్‌కు టికెట్ ఇప్పించినట్లు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు. నేను సీటును త్యాగం చేస్తేనే టికెట్ ఇచ్చారు. స్పీకర్ తల్లిని అవమానించారని రెండురోజులు అసెంబ్లీలో చర్చ జరిపారు. ఆడబిడ్డలమైన మా గురించి ఎందుకు మాట్లాడలేదు? శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ భూముల గురించి రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు. రంగారెడ్డి జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎక్కడెక్కడ భూములు పోగు చేస్తున్నారో మాకు తెలుసు. తిమ్మాపూర్ భూదాన్ భూములపై విచారణ చేయాలి. ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేసిన నాటి నుంచి ఇప్పటివరకు నా అఫిడవిట్లను పరిశీలిస్తే ఆస్తులు పెరిగాయో, తగ్గాయో తెలుస్తుంది. కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా చేసినప్పుడు ప్రజలపై ఆయనకున్న ఆర్ద్రతను గమనించాను. కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో ఎందుకు పాల్గొనలేకపోయానా అనే బాధ ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది' అని సబిత పేర్కొన్నారు. సమావేశంలో భారాస నేతలు సుమిత్రానంద్, హేమ, మమత, షకీలారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

అంకిరెడ్డిగూడెంలో వేడుకలు.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి: సుర్వి మల్లేష్‌గౌడ్

తొలివెలుగు, చౌటుప్పల్ : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గ్రామస్తులకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలు, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలందాస్ మహేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, పాలకవర్గ సభ్యులు బత్తుల అనూష మహేష్‌గౌడ్, పాలం వెంకటేశంగౌడ్, ముద్దం లింగస్వామిగౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్యగౌడ్, దండుగల వెంకటేశం, ఉపాధ్యాయులు దశరథ, నల్ల జయప్రద, సప్పిడి కల్పన, బొల్లు అండాలు, నాయకులు పర్ని శ్రీధర్‌రెడ్డి, మోడం కృష్ణయ్య, యాట మహేందర్, దండగల జంగయ్య, దండుగల నాగరాజ్, పంచాయతీ సిబ్బంది, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ట్యాంకర్ బీభత్సం

ఐదు కార్లు, 108ను ఢీకొట్టి వైనం

మిర్యాలగూడ: నల్గొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం అర్ధరాత్రి ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. ఐదు కార్లు, అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శ్రీనివాసరావు (36) కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మిర్యాలగూడలోని నందిపాడు సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి కింద పడిపోయి స్థితిలో కనిపించాడు. అతడికి సహాయం అందించేందుకు శ్రీనివాసరావు తన కారును రోడ్డు పక్కన ఆపి 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత సిబ్బందితో కలిసి బాధితుడిని అందులో ఎక్కిస్తుండగా.. వెనుక నుంచి వేగంగా గ్యాస్ ట్యాంకర్ దూసుకొచ్చింది. అది అదుపుతప్పి అంబులెన్స్ సహా మొత్తం ఐదు కార్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, అంబులెన్స్ మధ్యలో శ్రీనివాసరావు ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. అంబులెన్స్ సిబ్బంది స్వప్నకు తీవ్రగాయాలయ్యాయి.

ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. వేరే వాహనాల్లో ఉన్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.